విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

తుపాను కారణంగా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా మారి, బుధవారం సాయంత్రానికి మాండూస్ తుఫానుగా బలపడ నుంది. దీంతో 8,9,10 తేదీల్లో ఉమ్మడి, కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించడంతో రైతులు ఇప్పటికే కోసిన వరి పంటను కుప్పలు వేసుకోవాలని, వరి పంట కోతలు ఆపాలని, కళ్ళల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె మండల తహసీల్దార్ విశ్వనాథ శాస్త్రితో కలిసి మండలంలోని వివిధ పంట పొలాల్లో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణంగా గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. రైతులు అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు రెండు వేల టన్నులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు.

తెలుగుదేశం పార్టీలోకి వైకాపా కార్యకర్తల వలసలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం నగర పంచాయతీకి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోనికి వలసలు వెళ్లారు. నగర పంచాయతీకి చెందిన బెల్లాని శ్రీను, వాకా కనక రాజు, డొక్కా జోగారావులు వైస్సార్సీపీని వీడి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి వరుపుల రాజా సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి వరుపుల పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ త్వరలో అధికారంలోకి వస్తోంది అని, మీ అందరికి పార్టీ అండగా ఉంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో గారా చిన్ని, పొన్నపు రాజు, పొట్టూరి సూర్య, గుల్లా రాంబాబు, గొల్లాం సూరిబాబు, యరకుల మల్లేష్, వశంత ప్రసాద్, బీరా సగ్గునరావు, అప్పారావు, బొల్లం శ్రీను, బొండాడ శ్రీను, బొద్దు భంగార్రాజు, కొప్పిశెట్టి రాజశేఖర్, కుంద్రపు శ్రీను, అనుసూరి నాగరాజు, తదితరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

జిపిడిపి, బిపిడిపి అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలపై బుధవారం ఎంపీపీ శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, ఫ్రంట్ లైన్ వర్కర్లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్టు మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని 2023-24 సంవత్సరానికి ప్రభుత్వం గ్రామపంచాయతీలకు, మండల పరిషత్లకు బడ్జెట్లో కేటాయించిన నిధులు ఒక ప్రణాళిక బద్ధంగా ఖర్చు చేయుటకు అమలు చేయవలసిన, వాటిపై శిక్షణ అందించారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో భీమశంకర్, నాగేంద్ర, సునీల్ కుమార్, శ్రీనివాసరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జిపిడిపిపై అవగాహన సమావేశం

విశాలాంధ్ర- తాళ్ళపూడి : గ్రామ పంచాయతీ 2023-24 సంవత్సరానికి గాను అభివృద్ధి ప్రాణాళి&లు తయారు చేసేందుకు, వాటి పట్ల అవగాహన కల్పించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తాళ్లపూడి ఎంపీడీవో ఎం. రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు తొమ్మిది కీలకమైన శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఆయా అధికారులతో అభివృద్ధి పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఏఈ సూర్జహాన్, పంచాయతీరాజ్ ఏఈ విశ్వనాథ్ శర్మ, ట్రాన్స్కో ఏఈ వెంకట్రావు, జేడి పశుసంవర్థక శాఖ జెడి గోవింద్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వార్థం వీడి ప్రేమతో మెలగాలి

విశాలాంధ్ర - అనపర్తి : సాటి మనుషుల పట్ల స్వార్థాన్ని వీడి ప్రేమ కలిగి జీవించమని చెప్పిన ఏసుక్రీస్తు బోధనలు మానవజాతికి ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదిక ఆవరణలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే సత్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాస్టర్లకు రూ.5 వేలు గౌరవ వేతనంగా ఇస్తున్నారని పాస్టర్ల బాగోగులు ఆలోచించే ఏకైక ప్రభుత్వం ఇదే అన్నారు. అనంతరం క్రిస్మస్ పండగలో భాగంగా ఏర్పాటు చేసిన కేక్ ఎమ్మెల్యే కట్ చేసి క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సంతోషాలతో కూడిన వెలుగును ప్రజల జీవితాల్లో నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), సర్పంచ్, ఉప సర్పంచ్ వారా కుమారి, చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలరాంపురంలో క్రిస్మస్ సందడి

విశాలాంధ్ర - రౌతులపూడి : మండలంలో ముందుగానే క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. బలరాంపురం గ్రామంలో యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జి మోజేశ్ రాజ్ అధ్యక్షతన ఐక్య క్రిస్మస్ను జరిపించారు. ఎన్సిసి స్టేట్ రీజనల్ వైస్ చైర్మన్ సిహెచ్ రాజబాబు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఏసుక్రీస్తు ద్వారా మానవులకు పాపక్షమాపణ కలుగుతుందని, ప్రజలందరికీ రక్షణ కొరకు ఆయన మానవుడిగా ఈ భూలోకానికి వచ్చి శిలువపై ప్రజల కొరకు మరణించారని విజయ్ బాబు అన్నారు. గుంటూరు నుండి వచ్చిన లవ్ ఫెయిత్ అండ్ హెూప్ మినిస్ట్రీస్ రెవరెండ్ కే ఇజ్రాయిల్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అందరూ అనుసరించదగినవని సందేశం ఇచ్చారు. పేదలకు దుప్పట్లు, బ్యాగులు అందజేశారు. అనంతరం పేదలకు క్రిస్మస్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఏపీ స్టేట్ కింగ్స్ టెంపుల్ అపోస్టుల్ ఏ ప్రసాద్ పాల్, మరియు రౌతులపూడి, శంఖవరం మండలాల నుండి పాస్టర్లు గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

విజయవాడ తరలివెళ్లిన బీసీ నాయకులు

విశాలాంధ్ర - మండపేట : విజయవాడలో జరిగే జయహెూ బీసీ సదస్సుకు మండపేట, రూరల్ బీసీ నాయకులు తరలి వెళ్లారు. మంగళవారం రాత్రి 11 గంటలకు స్థానిక వైసీపీ కార్యాలయం నుండి బయలుదేరి వెళ్లారు. వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, పట్టణ శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పెంకే గంగాధర్ల ఆధ్వర్యంలో శెట్టిబలిజలు ప్రత్యేక బస్సులో తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, దేవస్థానం చైర్మన్ నూరంపూడి సత్య ప్రసాద్, మాజీ కౌన్సిలర్స్ యాండ్ర ప్రభాకరరావు, చొల్లంగి గోవిందు, సంఘ పెద్దలు కాద మాచరరావు, చొల్లంగి రాజశేఖర్, పలివెల నాగేశ్వరావు, గుత్తుల లోవరాజు, గెద్దాడ సత్యనారాయణ, సంసాని వెంకటేశ్వరావు, చిట్టూరి సత్యనారాయణ, జుత్తుగ సూరిబాబు, పలివెల లోవరాజు, వల్లు ప్రశాంత్, వాసంశెట్టి కామేశ్వరావు, శీలం సూర్యం, పలివెల రాంబాబు, దాసరి సత్తిబాబు, కుక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలతో ధాన్యానికి అధిక ధర

విశాలాంధ్ర - అమలాపురం : రైతాంగం ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకొని అధిక ధరలు పొందాలని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా పేర్కొన్నారు. బుధవారం ఆయన ఉప్పలగుప్తం మండల పరిధిలోని భీమనపల్లి, విలసవిల్లి గ్రామాలలో వ్యవసాయ, పౌర సరఫరాలు, రెవెన్యూ, తూనికలు కొలతలు అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత భీమనపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులు అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏ విధంగా ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టిందన్న వివరాలను అధికారులు రైతుల ద్వారా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఆర్బీకేలను ఆశ్రయించి ధాన్యం నమూనాలను అందించి వారి సూచనలకు అనుగుణంగా ధాన్యం ఆరబెట్టుకుని మంచి గిట్టుబాటు ధరలు పొందాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా అన్ని రకాల చర్యలు పటిష్టంగావించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విల్లసవిల్లి గ్రామంలో రైతాంగం కళ్ళాలో ఆరబెట్టిన ధాన్యరాశులను ఆయన క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి వాతావరణ హెచ్చరికలు మూలంగా ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కె తులసి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎ. పాపారావు, డిపిఓ వి.కృష్ణకుమారి తూనికలు కొలకలు శాఖల అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దారు ఎ. వెంకటేశ్వరి, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్యశ్రీ ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి

డీడీసీ సమావేశంలో అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర - కాకినాడ : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలందేలా కృషిచేయాలని ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్లో కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జిల్లా క్రమశిక్షణ కమిటీ (డీడీసీ) సమావేశం జరిగింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం జిల్లాలో అమలుతీరు, అందుబాటులో ఉన్న ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, అర్జీల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, నెట్వర్క్ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించే వ్యవస్థలో ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో 84 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్వర్క్ కింద ఆమోదం పొంది ఉన్నాయని, ఈ ఆసుపత్రుల్లో 79 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశానికి డీఎంహెచ్వో డాక్టర్ ఎం.శాంతిప్రభ, కమిటీ సభ్యులు డాక్టర్ ఎస్.చక్రరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ కె.నవీన్ తదితరులు హాజరయ్యారు.

సీనియర్ ఫోటోగ్రాఫర్ అన్నవరం మృతి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ ఫోటో గ్రాఫర్ దుర్గా స్టూడియో నల్లా అన్నవరం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సుదీర్ఘ కాలంగా ఫోటోగ్రాఫర్గా పనిచేస్తున్నారు. ఈయన లోక్సభ స్పీకర్ కీ.శే. జిఎంసి బాలయోగి, కీ.శే. డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావులకు ఫోటోగ్రాఫర్గా పనిచేశారు. అమలాపురం పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఫోటోగ్రాఫర్లు ఆయన దగ్గర శిక్షణ పొందిన వారు చాలామంది ఉన్నారు. అన్నవరం మృతి పట్ల ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసింది. అమలాపురం పాత్రికేయులు పలువురు అన్నవరం మృతి పట్ల సంతాపం తెలిపారు.

శ్మశాన వాటికలో సమస్యలతో సతమతం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మేజర్ గ్రామ పంచాయతీ కాట్రేనికోన గ్రామంలో ఎవరైనా చనిపోతే దహనసంస్కారాలు చేయడానికి స్థానికులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఇక్కడ సరైన స్మశాన వాటిక లేదు. ఓల్డ్ అయినాపురం కాలువ గట్టు వెంబడి బీసీ వర్గాలకు కేటాయించిన స్మశాన వాటిక స్థలంలో కనీస సౌకర్యాలు శూన్యం. రహదారి సౌకర్యం కూడా లేదు. ఈ ప్రాంతానికి వెళ్లాలంటేనే కాలువ గట్టు దిగబడిపోయి ప్రమాదంగా ఉంది. కాలువ గట్టు మీద గతంలో నిర్మించిన గ్రావెల్ రోడ్డు పూర్తిగా పాడయ్యింది. దీనికి తోడు పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు ఇక్కడనే దిగుమతి చేయడంతో అధ్వానంగా మారింది. గట్టు వెంబడి పందుల గుడిసెలు వేసి పందులను పెంచడంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారి దుర్వాసన వస్తోంది. పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చనిపోయిన వారి మృతదేహాలను తీసుకు వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఇక్కడ నెలకొంది. కనీసం తలదాచుకోవడానికి జాగా లేదు, గూడు లేదు. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ దహన సంస్కారాలు చేయాల్సి రావడంతో స్థానికులు అసౌకర్యం గురవుతున్నారు. వైసీపీ యూత్ లీడర్ కముజు సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ వాసులు స్థానిక సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ను కలిసి స్మశాన వాటికను అభివృద్ధి చేసి, పక్కా రోడ్డు నిర్మించాలని వినతిపత్రం అందించారు. స్మశాన వాటికలో అసౌకర్యాలు తొలగించేందుకు చర్యలు చేపడతానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

సంచుల కోసం రైతుల ఆందోళన

వాతావరణం మార్పుతో బెంబేలు

విశాలాంధ్ర - సీతానగరం : సంచులు ఎక్కడ అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలలో సంచుల కొరతతో రైతులు అధికారుల పై వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు నేపథ్యంలో రైతులు పొలాల్లో ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని దానికి అనుగుణంగా బస్తా సంచులను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల అధికారులు తహసీల్దార్ సత్యనారాయణ రాజు, ఎంపిడివో కె.రమేష్ వంగలపూడి, నాగాంపల్లి, సింగవరం గ్రామాల్లో రైతులతో గ్రామ సభలు నిర్వహించి రైతులకు బస్తా సంచులు త్వరలో వస్తాయని రైతులు ఆందోళన చెందవద్దు అన్నారు. రైతులు అధికారుల చెప్పినట్టు ఏమి జరగడం లేదని తుపాను వచ్చి ధాన్యం తడిచి పోతే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ అధికారులను నిలదీశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడం కోసం ఇబ్బందులు ఎదుర్కోవడం పై సామాన్య ప్రజల సైతం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మూలపేటలో గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మూలపేట బొమ్మల ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కొత్తపల్లి ఎస్సై రామలింగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం కొత్త మూలపేట బొమ్మలు పరిశ్రమ ఉన్న ప్రాంతంలో రోడ్డు ప్రక్కన ఉన్న తుప్పల్లో దుర్వాసన వస్తుందని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలపడంతో ఎస్సై ఆ ప్రదేశానికి చేరుకొని పరిశీలించగా గుర్తుతెలియని మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. అతని శరీర భాగం చెయ్యి విడిగా ఉన్నట్లు తెలిపారు. మృతుడు లుంగీతో ఉండగా వేరుగా ఉన్న చెయ్యికి ఉంగరం ఉన్నట్లు తెలిపారు. గత మూడు రోజుల క్రితమే మృతదేహం ఇక్కడ ఉండవచ్చని ఎస్సై తెలిపారు. ప్రమాదవశాత్తు మృతి చెందాడ లేక ఇతర సంఘటన ఏమైనా చోటుచేసుకుందా అనే కోణంలో కొత్తపల్లి పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి -ఎస్టియు

విశాలాంధ్ర - కాకినాడ : సంవత్సరకాలం పైగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిపడిన మొత్తాలను వెంటనే విడుదల చేయాలని బుధవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరానికి కాకినాడ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు కె. కాశీవిశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాస్ నాయకత్వం వహించారు. ధర్నా శిబిరాన్ని ప్రారంభిస్తూ ఎస్టియు సీనియర్ నాయకులు పి. సుబ్బరాజు తక్షణమే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిలు పడిన మొత్తాలను విడుదల చేయాలని, ప్రభుత్వం వెంటనే తన ప్రభుత్వ విద్యారంగ వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ నెలలుపైగా పిఎఫ్లోన్లు, పైనక పేమెంట్లు, ఎపిజిఎల్ఐ తుది పరిష్కారాలు, పిఆర్సి పెండింగ్, డిఏ అరియర్లు, మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు చెల్లింపు, ప్రతినెల జీతం 10, 15వ తేదీ వరకు నిరీక్షించవలసి వస్తోందని దీని వల్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ వాగ్దానం మేరకే సీపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మున్సిపాలిటీ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఓ పవర్స్ని కల్పించాలని, ప్రభుత్వ పంచాయితీ రాజ్ పాఠశాలల మాదిరిగానే ట్రైబల్ మున్సిపల్ మేనేజ్మెంట్స్లో కూడా పిఈటి, భాషా పండితుల పోస్టులు అప్గ్రేడ్ చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి శెశెట్టి సత్యనారా యణ, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు ఎన్ఎస్ఎన్ వెంకటేశ్వరరావు, పివివి సత్యనారాయణరాజు, టి. సంపత్కుమార్, పి. రామకృష్ణ, ఎన్ అర్జున్కుమార్, డివిఎన్ రాజు, ఎస్. రమేష్, పి.రామకృష్ణ, ఎ. అశ్విని, ఐ. సుధాపార్వతి, రాజేశ్వరి, జి. గాయత్రి, లక్ష్మీ నారాయణ, ప్రశాంతి, ఉమ్రానా, అపర్ణజ్యోతి, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, సుమారు 250 మంది వరకు పాల్గొన్నారు.

కుంగ్ ఫూలో దీప్తి విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - మామిడికుదురు : ఇటీవల హైదరాబాద్లో జరిగిన నేషనల్ లెవెల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ 2022లో దీప్తి పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని దీప్తి విద్యా సంస్థల కరెస్పాడెంట్ డీవీడీ సత్యనారాయణ తెలిపారు. ఈ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఇంజేటి సూర్య చరణ్ తేజ, ముస్కూడి పవన్ తులసి రాములు స్పారింగ్ విభాగంలో బంగారు పతకం, కటా భాగంలో రజత పథకాలు సాధించారు. ఐదో తరగతి చదువుతున్న ముస్కూడి సాయిధరమ్ తేజ స్పారింగ్, కటా విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ పోటీలు హైదరాబాదులో ఈనెల నాలుగో తేదీన న్యూ పవర్ కుంగ్ ఫు అండ్ కరాటే మెటీరియల్స్ అకాడమీ వారు నిర్వహించారు. ఇదే పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న నజీమ్ అలీ కటా విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను దీప్తి విద్యా సంస్థలు అధినేత డివివి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఆర్ స్వామి నాయుడు, కోచ్ మట్టా శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయుడు పివి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పంటకు గిట్టుబాటు ధర

విశాలాంధ్ర - గోపాలపురం : రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుం దని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు నూతన విధానం గూర్చి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో, తహసిల్దార్ మరియు వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో.రైతు భరోసా కేంద్రంలో రైతులకు నూతన విధానంలో ధాన్యం కొనుగోలులో ఉన్నటువంటి ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దళారి వ్యవస్థ ద్వారా మోసపోకుండా సరైన గిట్టుబాటు ధర సాధించుకునే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు. ఆయా గ్రామ సర్పంచులు అధ్యక్షతన చిట్యాల, భీమో లు, వేళ్ళ చింతలగూడెం, జగన్నాధపురం, కరిచర్లగూడెం, గుడ్డిగూడెం, సంజీవపురం కొవ్వూరుపాడు, కరకపాడు గ్రామాలలో నిర్వహించారు.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
O.S. 207/2020
Between:
Bank of Baroda, N.A.D. Kotha Road Branch, Visakhapatnam, Rep. by its Branch Manager ...Plaintiff
And
Vanapalli B.S.V.M. Sagar..Defendant
SUMMONS
To
The Defendant:
Vanapalli B.S.V.M. Sagar,
S/o. Vanapalli Ramakrishna,
Hindu, aged 37 years,
R/at Radhakrishna Gari Building,
Munasaba Street, Dowleswaram,
East Godavari District.
Please take notice that the above named Plaintiff has instituted the above suit against of you for recovery of amount with subsequent interest and costs and other reliefs and the matter stands posted to **14-12-2022** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **14-12-2022 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
Y.N. RAO, Advocate
Visakhapatnam-43. **Cell: 92471 65839**

కార్మికుల దేవుడు కేవీ రాఘవులు

విశాలాంధ్ర - అమలాపురం : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కెవి రాఘవులు చేసిన పోరాటాలు అజరామరమని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు అన్నారు. కామ్రేడ్ కేవీ రాఘవులు 12వ వర్థంతి సభకు ఎపిపిఆర్టిడి ఉద్యోగ సంఘ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నంద్యాల రామ చంద్రరావు అధ్యక్షత వహించారు. వాసంశెట్టి సత్తిరాజు మాట్లాడుతూ రాఘవుల/ కార్మికుల దేవుడని కొనియాడారు. ఎపి ఆటోకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, సిపిఐ అమలాపురం నియోజక వర్గ కార్యదర్శి అడపా సత్యనారాయణ, డిహెచ్పిఎస్ కమిటీ రథ సారధి మోకా శ్రీనివాసరావు, జట్లు లేబర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కురచ నాగేశ్వరరావులు ఉపన్యాసించారు. ఈ బహిరంగ సభకు ముఖ్య వక్తగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు విచ్చేసి మాట్లాడుతూ నేడు దేశంలో నెలకొన్న ఆర్థిక మాంద్యం పైన కేంద్ర ప్రభుత్వం పెదవి మెదపలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీలు, విశాఖ ఉక్కు తెగనమ్మటం పైన ముఖ్యమంత్రి రాష్ట్రంలో అఖిలపక్షాన్ని కలుపు కొని కేంద్రతో పోరాడాలని డిమాండ్ చేశారు. కెవి రాఘవులుతో పాటు అమర వీరుల స్మారక స్థూపాలు నిర్మాణం చేపట్టాలని బహిరంగ సభ తీర్మానం చేసింది. ఖండవెళి ఏలియా, మట్టపర్తి ప్రసాద్, పెద్ద పూడి వెంకట్రావు, నెల్లి వెంకటేశ్వరరావు, మల్లారపు సత్యనారాయణలు, రాఘవులు బడుగు, బలహీనవర్గాల ప్రయోజనం కోసం చేసిన పోరాటంతో ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర అంతటా సామాజిక మార్పు జరిగిందని ఉదాహరణతో వివరించారు.

జిమ్ క్రీడాకారులను అభినందించిన ఏఎస్పి

విశాలాంధ్ర-ఎటపాక : ఖమ్మంలో జరిగిన తెలంగాణ స్టేట్(6 జిల్లాల) బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభను కనబర్చి అన్ని విభాగాలలో పత కాలను సాధించిన క్రీడాకారులను భద్రాచలం ఏఎస్పి రోహిత్ రాజు అభినందించారు. 11,12 తేదీలలో హైదరాబాద్లో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని,పతకములను తీసుకురావాలని సూచించారు. క్రీడల ద్వారా ఫిట్ నెస్సు కాపాడుకోవడమే కాకుండా శారీరక,మానసిక రుగ్మతలు కూడా తొలగి, ఆరోగ్యంగా ఉండవచ్చునని,ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. అన్ని విభాగాలలో పతకాలను సాధించటానికి కారణమైనటువంటి ఎటపాక మండలం పురుషత్త పట్నం సిటీ స్టైల్ జిమ్ కోచ్ రామి రెడ్డి ని రోహిత్ రాజు అభినందించారు.

విద్యార్థులకు ప్రభుత్వ వైద్యంపై అవగాహన

విశాలాంధ్ర-కూనవరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై కూనవరం, వి ఆర్ పురం మండలాలలోని సాయి ప్రశాంతి డిగ్రీ కళాశాల మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు డాక్టర్ పి. గౌతమి, చిన్నపిల్లల వైద్యులు వంశీ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కూనవరం సీహెచ్సీలో ఎక్స్రే, స్కానింగ్, రక్త పరీక్షలు. 102 వాహనం ఉపయోగాలు , ఎస్ఎన్ సీయు,చిన్న పిల్లల వార్డులో అందించే వైద్య సేవలు, ఎన్ ఆర్ సీలో పిల్లలకు అందించే పౌష్టికాహారం వైద్య సేవలు టీబీ వ్యాధికి సంబంధించిన పరీక్షలు ఎమర్జెన్సీ సేవల గురించి వివరించారు. ఆరోగ్య శ్రీ సేవలు ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విధానం పై అవగాహన కల్పించారు.

14 ఏళ్ళ సమస్యకు ఎమ్మెల్యే చెక్

విశాలాంధ్ర - అనపర్తి : ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చొరవతో 14 ఏళ్ళుగా పెండింగ్లో ఉన్న రామేశ్వరపు రాజును తాత్కాలిక గ్రామ రెవెన్యూ సహాయకుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా గ్రామ రెవిన్యూ సహాయకుని ఉత్తర్వులు రామేశ్వరపు రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, ఇన్చార్జి తహసీల్దారు శశిధర్ ఉన్నారు.

త్వరలో పాలవెల్లువ అమలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండలంలో జగనన్న పాల వెల్లువ అమలు చేసే చర్యల్లో భాగంగా మహిళా సంఘాలను గ్రూపులుగా ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు సంబంధిత శాఖ జెడి గోవింద్ తెలిపారు. ఆయన బుధవారం తాళ్ళపూడి వచ్చి ఐకెపి, సచివాలయ సిబ్బందితో కలిసి కొన్ని సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే నాణ్యమైన పాలను సరఫరా చేసే పేరున్న అమూల్ కంపెనీతో టై అప్ తో పాలవెల్లువ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాలు మాదిరిగానే, మహిళా సంఘాలు ఏర్పాటు చేసి వారి ద్వారా పాల సేకరణ చేసి, సంఘాలకు ఆర్థిక తోడ్పాటు కల్పించనుందని తెలిపారు. తాళ్లపూడి మండలంలో 11 , గోపాలపురం మండలం 13 కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా పాల సేకరణ చేస్తామన్నారు. ఇప్పటికే చాగల్లు దేవరపల్లి నల్లజర్ల మండలాల్లో రోజుకు 4000 లీటర్లు పాల సేకరణ జరుగుతుందన్నారు. త్వరలో పాల సేకరణ చర్యలు అమలులోకి వస్తాయన్నారు.

జనసేన ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బొబ్బిలి సత్తిబాబుకు జన సేన పార్టీ తరుపున రూ.10వేల ఆర్థిక సహాయం, 75 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి గ్రామ జన సేన అధ్యక్షులు కంబాల సత్తిబాబు ,నియోజక వర్గ నాయకులు సువర్ణ రాజు,సిర్ర రాము, బాలు, తాతబ్బయ్, కొడమంచిలి శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక



విశాలాంధ్ర - దేవరపల్లి : మండలం లో రామన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్స్ బాల బాలికల సెలక్షన్ లలో క్రీడాకారులను ఎంపిక చేసినట్టు అధ్యక్ష, కార్యదర్శులు రాంప్రసాద్, శ్రీతిరుమల తెలియజేసారు. బాలికల విభాగంలో ఎం.పూజిత, (కె.గోకవరం)స్మృతి, (రామన్నపాలెం), ఏ.అరుణశ్రీ (కె.గోకవరం), ఐ.దుర్గాభవాని, (కె.గోకవరం)బాలుర విభాగంలో తేజ (కె.గోకవరం),సంజయ్ (చిన్నాయిగూడెం), ఆర్.మణికంఠ(కె.గోకవరం),పి.ఆనంద్,(రామన్నపాలెం) ఎంపికైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పేరం రవీంద్ర పీఈటి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సోషల్ ఆడిట్

విశాలాంధ్ర-ముసునూరు: చనిపోయిన వ్యక్తి ఉపాధి హామీ పథకం పనిలో హాజరు వుండటంతో పాటు నేటికి కూడా డిమాండ్‌లో పేరు రావడం ముసునూరు మండల ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్ ద్వారా వెలుగులోకి వచ్చింది. మండలో కేంద్రమైన ముసునూరు ఉపాధిహామీ పథకం కార్యాలయం వద్ద మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టం ప్రకారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఏలూరు జిల్లా డ్వామా పీడి డి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధికారి పరవేక్షణ లోపం వల్ల చనిపోయిన వ్యక్తులు ఉపాధి పనిలోకి వచ్చినట్లు వేలి ముద్రలుండటం, ఒకే ఇంటిలో ఒకే రేషన్‌కార్డులో ఇద్దరికి వేరు,వేరు జాబ్ కార్డు వుండటం గమనర్హం. ఇలా గోప వరం గ్రామంలో జరగడంతో, ఫీల్డ్ అసిస్టెంటుతోపాటు ఉపాధి మెటును కుడా సస్పెండ్ చేశారు. మస్టరులో పని దినాలు తక్కు వగా,వుండటం ,వారి ఖాతాలో ఎక్కువ నగదు జమ చేయడం , కోన్ని గ్రామాల్లో పని ఒక చోట చూపి ,వేరే చోట పనిచేయించ డం,తక్కువ పని చూపి ఎక్కువ పని వున్నచోటకి మార్చి ఎక్కువ ఎస్టిమెట్ వేసినట్లు కాత్రేనిపాడు గ్రామంలో జరిగింది.. మరికొన్ని గ్రామాల్లో నిమ్మ,జామ,మామిడి మొక్కలు రికార్డులో వున్నట్లు చూపడం,ఫీల్డ్ (పొలంలో) మొక్కలు లేకపోవడం కూడా గ్రామాల్లో జరిగినట్లు సోషల్ ఆడిట్ అధికారులుప్రజావేదికలో వివరించారు. రికవరి విషయంలో రూ.2,34,575లు జమ చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్సు పర్సన్ టి.వెంకటేశ్వరరావు,జిల్లా విజిలెన్సు అధికారి ఏ.వి.విజయలక్ష్మి, ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఏపిఓ జయప్రసాదు,సిబ్బంది పాల్గొన్నారు.

'సైకో' పాలన పోయి 'సైకిల్' పాలన రావాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలో 'సైకో' పాలన పోయి 'సైకిల్' పాలన రావాలని టీడీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి గంగిరెడ్ల మేఘులాదేవి పిలుపునిచ్చారు. 'టీడీపీ మహిళ నేతల ' ఆధ్వర్యంలో తలపెట్టిన 'మాటామంతి' కార్యక్రమం గోడ పత్రికను మేఘూలదేవి ,టీడీపీ మహిళ విభాగం నేతలు, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ పై మేఘుల దేవి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జగన్ ను నమ్మి ఓటేసి మహిళా వర్గం మోసపోయిందని, జగన్ ధన దాహానికి మహిళల తాళిబొట్లు తెగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళ నేతలు చెరుకూరి రమ్య, కాకి లక్ష్మీ, లావణ్య, రొక్కం లక్ష్మీ, సావిత్రి, కుమారి , కరుణా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

విశాలాంధ్ర - ఏలూరు : ప్రభుత్వ బోధనాస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో 8 మంది తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 20 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ జి.చైతన్య కిరణ్, ఎన్. విజయ, స్టాఫ్ నర్సులు డి.గౌతమి, సిహెచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి: నేటి సమాజంలో యువత మంచి మార్గంలో నడవడానికి క్రీస్తు బోధనలు మార్గదర్శకం కావాలని దర్భ గూడెం పంచాయతీ సర్పంచ్ సున్నం ఉషారాణి అన్నారు. మంగళవారం రాత్రి లక్ష్మీపురం గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో గుర్రాల థామస్ ఇంటి వద్ద ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రైస్తవ గీతాలాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బి. కృపారాజు, జీలుగుమిల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొంతు రామారావు, డి. లోకేష్, కేఎన్ ప్రసాదు, సంఘస్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కాళ్ల మండల కౌన్సిల్

విశాలాంధ్ర - కాళ్ళ: యూటీఎఫ్ కాళ్ళ మండల కౌన్సిల్ సమావేశం అధ్యక్షులు బి.ఆర్.ఎం. కోటేశ్వరస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ పటిష్ఠతకు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి సమస్యలు సాధించేది ఒక్క యూటీఫ్ మాత్రమేనన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే మనం అనుకున్నది సాధించగలమని గోపిమూర్తి చెప్పారు. సి.పి. యస్ రద్దుకోసం యూ. టి.ఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని గోపీమూర్తి అన్నారు. జిల్లా అధ్యక్షులు పి. యస్ విజయరామరాజు మాట్లాడుతూ సంఘం ఇచ్చే పిలుపునకు అందరూ స్పందించి హాజరై కోర్కెలు సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా ఎన్నికల అధికారి సి. హెచ్. పట్టాభిరామయ్య కె. సాయిరాం ఆధ్వర్యంలో యూటీఎఫ్ కాళ్ళ మండల శాఖను ఎన్నుకున్నారు.
మండల ఆఫీస్ బేరర్స్ : గౌ.అధ్యక్షులు: కె.సత్యనారాయణ,అధ్యక్షులు: బి.రాజమౌళి కోటేశ్వర స్వామి, సహాధ్యక్షులు: పి. ప్రభుదాస్, మహిళా సహాధ్యక్షురాలు డి. కనకదుర్గ, ప్రధాన కార్యదర్శి: ఎం. శంకర్రావు, కోశాధికారి: వి.వి.ఆర్.కె.రవికుమార్ రాజు,
కార్యదర్శులు: కె. రామ్మూర్తి రాజు, కె. అశోక్, ఎం.సిహెచ్.సత్యబాబు,బి.కిషోర్, జి.కిషోర్ కుమార్, ఎం. శివాజీ, బి. అనూరాధ, పి. విష్ణుప్రసాద్, ఎస్. వి. అప్పలనాయుడు, ఆర్. వెంకన్నబాబు, ఆడిటర్ : కె. వి. అప్పలరాజు, అనంతరం మండలంలోని ప్రతీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సి-2022లో ప్రధమస్థానం పొందిన విద్యార్థినీ విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

బీసీలకు ప్రభుత్వం మొండి చేయి :జయ మంగళ

విశాలాంధ్ర -కైకలూరు : విజయవాడలో వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమాన్ని ఖండిస్తున్నామని మాజీ శాసనసభ్యులు కైకలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలం లోని ఆటపాక గ్రామం లోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ బీసీ లకి చేసింది ఏమిటని నిలదీశారు. తమ ప్రభుత్వం హయాంలో బీసీ లకు కార్పొరేషన్ నిధులతో ఆదుకున్నామని ఆదరణ పథకముతో బీసీ లో వున్నా అనేక కులాల వారికీ కులవృత్తిల సామాగ్రిని అందించామని అన్నారు. సంక్రాంతికి పేద బీసీ కుటుంబం సంతోషంగా పండగ జరుపుకోవాలని సంక్రాంతి కానుక అందజేశామన్నారు. టిడిపి ప్రభుత్వం అంటే బీసీ ల ప్రభుత్వం అన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో ఏం లబ్ధి చేకూర్చారు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా శాంతి వర్ధన

విశాలాంధ్ర - పెద్దాపురం : వీధి వ్యాపారులకు, తోపుడుబండ్ల వర్తకలకు శాంతి వర్ధనా స్వచ్ఛంద సేవా సంస్థ అండగా ఉంటుందని బెంగళూరుకు చెందిన కమ్యూనిటీ యాక్షన్ ప్రతినిధి, పార్టనర్ షిప్ ఎంగేజ్మెంట్ స్పెషలిస్ట్ ఎన్ రాంబాబు, సీఏసీ ప్రతినిధి, సోషల్ ప్రొటెక్షన్ లీడ్ పి భూపతి అన్నారు. మండలంలోని పులిమేరు శాంతి వర్ధనా ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం పట్టణంలోని బిఆర్ అంబేద్కర్ భవనంలో మెప్మా సంయుక్తంగా నిర్వహించిన వీధి వ్యాపారులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా మెప్మా టిఈబిబిబి కె మోహన్ కుమార్, శాంతివర్ధన సంస్థ డైరెక్టర్ రాయవరపు వీరబాబు, పెద్దాపురం సీఎంఎం కె వెంకటలక్ష్మిలతో కలసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో పి. రఘువీర్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ సహకారాలతో పాటు, సిఏసి, శాంతి వర్ధన ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో ఎంతమంది వీధి వ్యాపారులు పడిన ఇబ్బందులు దృష్ట్యా వారికి అందాల్సిన సహాయ చర్యల్లో భాగంగానే ఈ హెల్ప్ డెస్కను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాంతి వర్ధన సేవా సంస్థ ద్వారా వీధి వ్యాపారులు, తోపుడు బళ్ళు వర్తకులకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిం చేందుకు సిఏసి ముందుంటుం దన్నారు. అనంతరం వారు హెల్ప్ డెస్కు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ తోపుడుబండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు నాళం సింహాచలం, గౌరవ అధ్యక్షులు గండి మూర్తి, కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, కోశాధికారి బైలపూడి శ్రీనివాసరావు, సిద్ది వినాయక తోపుడుబండ్ల వర్తక సంఘం అధ్యక్షులు పల్లా వెంకటేశులు, నాళం శివన్నారాయణ, సర్వసిద్ది శ్రీను, గద్దం శ్రీను, మాలి రూపారాం ఆయా వర్తక సంఘాల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది, చిరు వ్యాపారులు, శాంతి వర్ధన ఏఒ వేణు, బాబి, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సాయం మరువలేనిది

విశాలాంధ్ర -చాట్రాయి: పేదోళ్లకు జగనన్న చేస్తున్న సాయం ఎన్నటికీ మరువలేనిదని వైసిపి చాట్రాయి మండల యువ నాయకులు చెలికాని శ్రీరామ్ కొనియాడారు. బుధవారం చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో మృతి చెందిన ఉల్లాస శీను కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.10వేలు నగదును అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ

విశాలాంధ్ర-ఆకివీడు: బీసీలకు అండగా ఉండేది టిడిపియేనని ఆకివీడు మాజీ ఏఎంసీ చైర్మన్, టిడిపి మండల అధ్యక్షుడు మోటపల్లి రామా వర ప్రసాద్ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలపై వ్యవహరి స్తున్న తీరుని ఖండిస్తూ ఆయన ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నందమూరి తారకరామారావు నుండి ప్రస్తుతం చంద్రబాబు నాయుడు వరకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొల్ల వెంకట్రావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు బొల్లా వీర శ్వేత, గంధ ఉమా, భూపతి రాజు తిమ్మరాజు, అజ్మల్, దూబ సురేష్, నౌకట్ల రామారావు, జన్ను గోపి, పమ్ము తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఇదేంకర్మ

విశాలాంధ్ర -భీమవరం: పశ్చిమగోదావరిజిల్లా తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఇదేంకర్మ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద నిర్వహించి కలెక్టరు పి.ప్రశాంతికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేనేని గౌరునాయుడు, తాడేపల్లిగూడెం ఇన్చార్జి వలవల బాబ్జి, నరసాపురం ఇన్చార్జి పొత్తూరి రామాంజనేయరాజు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి పిచ్చెట్టి బాబు, అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పాడ రవి, అంగన్వాడి డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగాని నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

విశాలాంధ్ర -భీమవరం: ఓటే వజ్రాయుధమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. డీఎన్నార్ కళాశాలలో బుధవారం ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఓటుతో ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు నిర్మించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ వై.రవికుమార్, కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ఎ.ఓ. పి.రామకృష్ణంరాజు, చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం యూనిట్ పరిధిలో గల లొల్ల గ్రామంలో రైతులకు ఆకుమడులకు, పెరటి తోటలకు నీమాస్త్రం తయారు చేయించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఐసిపిఆర్ ఎస్ ఆధ్వర్యంలో నీమాస్త్రం తయారీ విధానాన్ని చూపించి నీమాస్త్రం పురుగులను నివారించడానికి ప్రాథమిక దశలలో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మట్టా శ్రీకళ, పి విజయలక్ష్మి, భవాని, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

విశాలాంధ్ర - మండపేట : దత్తాత్రేయ స్వామివారి జన్మదిన వేడుకలు మండపేటలో ఘనంగా జరిగాయి. బుధవారం తర్పాణీపేట సాయిబాబా ఆలయంలో ఆలయ వ్యవస్థాప కుడు కాసా నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆనంద్ దత్తాత్రేయునికి పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ భగవానుడు మార్గశిర మాసంలో జన్మించారని ఆనంద్ భక్తులకు వివరించారు. హిందువుల ముఖ్యమైన పండుగలలో భగవానుడి జయంతి ఒకటి అన్నారు. స్వామి వారు మూడు తలలు, ఆరుచేతులతో విష్ణువు అవతారంగా కూడా పరిగణించ బడతాదన్నారు. ఈయనను మ్రొక్కిన వారికి ఆరోగ్యం ఐశ్వర్యం సిద్దిస్తిందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గుండు తాతరాజు, కోన సత్యనారాయణ, పసుపులేటి వెంకట్రావు, ప్రసాద్, రాము, క్రిష్ణ , భక్తులు పాల్గొన్నారు.

వన్నెపూడిలో ఘనంగా దత్త జయంతి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామంలో దత్త జయంతి ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి దత్త స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు మొయిళ్ళ వీరరాఘవులు, కందా సత్యం బాబు పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న 100 మంది స్వామి వారి మాల వేసి 45 రోజులు దీక్ష చేసి దత్త జయంతి నాడు దీక్ష విరమణ చేస్తారని అర్చకులు గోవర్ధనం గణేష్ ఆచార్యులు తెలియజేసారు. భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో దత్త స్వామిని దర్శించుకుని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భారీ బాణా సంచా ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే వర్మ దత్త స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గొల్లప్రోలు ఎస్ఐ వినయ్ ప్రతాప్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జి మామిడాడలో దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - పెదపూడి : దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. జి మామిడాడ గ్రామంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గొల్లలమామిడాడ సూర్య సభ్యులు రాజారెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ద్వారంపూడి వెంకటరెడ్డి(చింతపండు) ఒకేసారి ఇద్దరు విద్యార్థులకు శిక్షణనిచ్చే స్పీచ్ ట్రైనర్ను బహుకరిస్తామని హామీ ఇచ్చారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట్రెడ్డి మెడల్స్, గిఫ్ట్స్ అందజేసారు. కర్రి తాతారెడ్డి రూ.3800ల విలువైన స్పైరల్ బైండింగ్ మిషన్ను అందజేసారు. తిబిరిశెట్టి వీరభద్ర రావు హైదరాబాదు వాస్తవ్యులు బొప్పన ఆదిలక్ష్మిలు రూ.8500ల విలువైన బీరువాను బహుకరించారు. ఐఈఎస్ఎస్ టీచర్, ఫిజియోథెరపిస్ట్ అరుణ సౌజన్య రూ.3500ల విలువైన బోర్డులను అందించారు. పెదపూడి మండలం ఎంఆర్సి కంప్యూటర్ ఆపరేటర్ ప్రకాష్ విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్, డ్రింక్ బాటిల్స్, ఏర్పాటు చేసినారు. ఎస్ఐ పి వాసు 80మంది విద్యార్థిని విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులును, దాతలను మరియు అతిథులను సన్మా నించుట జరిగింది. కార్యక్రమంలో మండల ఎంపీపీ కె తులసి శ్రీనివాస్, సర్పంచ్ మున్ని లైన్స్ క్లబ్ సభ్యులు వెంకట రెడ్డి, రాజారెడ్డి, మోహన్ రెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, ఏఎల్ఎస్సి హరికృష్ణ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

విశాలాంధ్ర - అలమూరు : గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో కె. జాన్ లింకన్ అన్నారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఆమయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామాల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతు బుధవారం రెండవరోజు కొనసాగింది. ఇందులో భాగంగా పలువురు సీనియర్ కార్యదర్శులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. పలువురు అధికారులు దీనిపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మురళి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ పోచమ్మ, ఈవో పీఆర్డి రాజ్ కుమార్, ఏవో రాం స్వరూప్, డి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీ సీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉండేశ్వరపురంలో జగనన్న ఇళ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర - సీతానగరం : ఉండేశ్వరపురం గ్రామంలో జగనన్న ఇళ్లకు శంకుస్థాపన చేశారని ఎంపిడివో కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో రమేష్ మాట్లాడుతూ ఉండేశ్వరపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీలో భాగంగా కొత్తగా 135 లబ్దిదారులకు ఈ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పంపిణీ జరిగిందని, దీనిలో ఇంటి స్థలం పొందిన ఒక లబ్దిదారుడు బుదవారం మొట్టమొదటిగా శంకుస్థాపన నిర్వహించారని అలగే మిగిలిన లబ్దిదారులు కూడా తమ సొంత ఇంటి కళ నెరవేర్చి కోవాలని అని అన్నారు. ఈ కార్య క్రమంలో హౌసింగ్ ఏఈ రామారావు, కార్యదర్శి విఠల్, సచివాలయం సిబ్బంది, లబ్దదారుకు పాల్గొన్నారు.

విద్యతోనే లింగ వివక్షకు చెక్

విశాలాంధ్ర-వీరులపాడు: విద్యతోనే లింగ వివక్షకు స్వస్తి పలకవచ్చని, బాలికలు ఉన్నత చదువులపై దృష్టి సారిస్తే ఎలాంటి సవాళ్లైనా ఎదుర్కొనవచ్చని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. వీరులపాడు మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ భవనంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో "లింగ వివక్షత" పై కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల ఎంపీపీ కోటార్ లక్ష్మి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే చదువుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అవిద్య, అనాధారణ, లింగ వివక్ష వంటి వాటిని అధిగమించి బాలికలు ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి, అంగన్వాడి కార్యకర్తలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో అవినీతి ఉండకూడదు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి

విశాలాంధ్ర - కరప : పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, అమల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి అనేది ఉండకూడదని విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి, కమిషన్ సభ్యులు జె కృష్ణకిరణ్, పౌర సరఫరాలు, ఐసీడీఎస్, విద్య తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కరప మండలం, పెనుగుదురు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని, మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాలను, సరుకుల నాణ్యతను పరిశీలించి పాఠశాల విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యం ప్రాధాన్యం, పోషక విలువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వేలంగిలోని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎంఎల్ఎస్ పాయింటును సందర్శించి బియ్యం బస్తాలు, కందిపప్పు నిల్వను పరిశీలించి హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురజానపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ వెంట ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి సురేష్, సివిల్ సప్లయ్స్ డీఎం డి పుష్పమణి, జిల్లా పౌరసరఫరాల అధికారి డి చాముండేశ్వరి, ఏఎస్‌వో టి ప్రసన్న లక్ష్మీదేవి, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, ఇన్‌ఛార్జ్ డీఈవో ఆర్‌జే డానియల్ రాజు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్‌డి సలీమ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్

విశాలాంధ్ర - అంబాజీపేట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేటలో కల్వరి ప్రేయర్ హౌస్ నందు ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా మరియు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలిపి యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ బిషప్ జల్లి జార్జ్ పాపఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు లోక రక్షకునిగా ఈ లోకానికి వచ్చిన కారణాలను తెలుపుతూ, ఆయన ఈ లోకానికి వెలుగై ఉన్నాడని, ఆయన పంచిన ప్రేమని పంచడమే క్రిస్మస్ అని వివరించారు. ప్రతి ఒక్కరు పదిమంది పేదలకు సహాయం చేసేటటువంటి గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం బిషప్స్ కౌన్సిల్లో ఉన్న కార్యవర్గమంతా క్యాండిల్స్ వెలిగించి కేక్‌ని కట్ చేసి క్రిస్మస్ సంబరాలు జరుపు కొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జార్జ్ పాపఫ్ నూతనంగా నిర్మించిన సిపిహెచ్ ప్రేయర్ హౌస్‌ని ఎలమంచిలి ప్రవీణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బిషప్ బాలరాజు, కార్యదర్శి బిషప్ వానాల డేవిడ్, బిషప్ మోజెస్, బిషప్ విక్టర్ పాల్, బిషప్ నవీన్ కుమార్, బిషప్ మోహన్ రావు, బిషప్ ప్రసాద్, బిషప్ ప్రభు కుమార్, అభిషేక్ విజయ్ కుమార్, బిషప్ రత్నరాజు, డాక్టర్ జల్లి విక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. బిషప్ కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించి పలు పాదనలు ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బరియల్ గ్రౌండ్స్ కొరకు, రెండవ పాస్టర్ల గౌరవ వేతనం గురించి ప్రభుత్వ రూల్స్ సడలించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించడం జరిగింది.

రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న వాతావరణం

విశాలాంధ్ర -కూచిపూడి : వాతావరణంలో ఏర్పడిన మార్పుతో వరిపైరు కోత కోసినరైతుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. ఈనెల 8,9 తారీకులలో తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయంతో ఒకవైపు వాట్సాప్ లో, మరొకవైపు పత్రికలు, టీవీ ఛానల్లో సమాచారం రావడంతో బుధవారం రైతులు వరి కుప్పలు వేయించడానికి ఉరుకులు, పరుగులు పెట్టారు. దీనితో కూలి రేటు మామూలుకంటేరెండు రెట్లు పెరిగింది. ఎకరానికి వరి కోత రూ3.5 వేలుతో కోయించుకున్న రైతులు వాతావరణ మార్పుతో కట్టివేత, వరికుప్ప వేయటానికి ఎకరానికి?.7 నుంచి ?.8 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది. ఒకవేళ వర్షం పడితేపనల మీద తడిస్తే ధాన్యం దెబ్బతిని అమ్మకాలు జరగవేమోనని, ఒకవేళ అమ్మకుజరిగినా రేటు బాగా తగ్గిపోతుందనే భయంతో అధికరేటు చెల్లించి కుప్పలు వేసి ఊపిరి పీల్చుకున్నారు.

వీరజవాన్ల కుటుంబాలకు చేయూతనిచ్చేందుకే
సాయుధ దళాల పతాక దినోత్సవం

విశాలాంధ్ర-మచిలీపట్నం: వీర జవాన్లకు వందనం సమర్పించటం, వారి కుటుంబాలకు చేయూతనివ్వటమే సాయుధ దళాల పతాక దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బుధవారం కలెక్టర్ బంగ్లాలో సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల సైనిక సంక్షేమ అధికారిణి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కళ్యాణ వీణ.కె(రిటైర్డ్) కలెక్టర్‌కు పతాక నిధి జెండాను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తుందన్నారు. పాకిస్థాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ యుద్ధంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైనికుల ధైర్యసాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తుందన్నారు. సాయుధ దళాల నిధికి ఆయన తన తొలి విరాళాన్ని అందచేశారు. సాయుధ దళాలు దేశరక్షణ కొరకు అహర్నిశలు చేస్తున్న కృషి, శత్రువుల బారి నుండి దేశాన్ని రక్షిస్తూ వారు చేసిన త్యాగాలు గుర్తు చేసుకుంటూ, వారి కుటుంబాలకు అందరూ అండగా నిలబడాల్సిన ముఖ్యమైన రోజన్నారు. ఎంతోమంది సైనికులు దేశ రక్షణలో తమ ప్రాణాలు తృణప్రాయంగా అర్పించారన్నారు. మనందరి రక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన సైనికుల కోసం ఈ పతాక నిధికి అధికారులు, ఉద్యోగులు, ప్రజలు విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు, మచిలీపట్నం సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడెల్లి వసంతరావు, ముఖ్య కార్యదర్శి శరత్‌బాబు, కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.వాల్టర్స్, వై.లక్ష్మణరావు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ ద్రోహి జగన్మోహనరెడ్డి

విశాలాంధ్ర-మచిలీపట్నం: బిసి సబ్‌ప్లాన్ నిధులు రూ.34వేల కోట్లు దారి మళ్ళించిన బిసి ద్రోహి జగన్మోహనరెడ్డి అని కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు ధ్వజమెత్తారు. కొనకళ్ళ నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం ఇదేం ఖర్మ బిసిలకు కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న బిసి వ్యతిరేక వైఖరి, బిసి అణచివేత చర్యలను ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం పాదయాత్రగా వెళ్ళి కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన 100 సంక్షేమ పథకాలను రద్దు చేసి రూ.34వేల కోట్ల బిసి నిధులను జగన్మోహనరెడ్డి ప్రభుత్వం దారి మళ్ళించటం సిగ్గుచేటన్నారు. మూడున్నరేళ్ళ వైసిపి పరిపాలనలో బిసి సాధికారతను జగన్మోహనరెడ్డి మంటగలిపారన్నారు. ఆదరణ పథకం రద్దు చేశారని, స్థానిక సంస్థల్లో 10శాతం రిజర్వేషన్లు కోత వేసి సుమారు 16800 రాజ్యాంగబద్ధ పదవులను బిసిలకు దూరం చేశారన్నారు. రాష్ట్రంలో బిసిల అసైన్డ్‌భూములు 8వేల ఎకరాలు పైబడి బలవంతంగా స్వాధీనం చేసుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఎపుడు ఎన్నికలు జరిగినా బిసిలు అందరు ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని దింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గన్నవరం, గుడివాడ, పామర్రు, పెడన, పెనమలూరు నియోజకవర్గ బాధ్యులు బచ్చుల అర్జునుడు, రావి వెంకటేశ్వరరావు, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, పి.వి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపరమైన ఒత్తిడి నివారణకు జర్నలిస్టులకు అవగాహన

విశాలాంధ్ర-విజయవాడ : జర్నలిస్టులు వృత్తి పరంగా ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి నివారణకు జర్నలిస్టులకు అవగాహన కల్పించేలా ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నేడు(గురువారం) సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గం.కు జరగనున్న ఈ సదస్సులో "జర్నలిస్టులకు మానసిక ఒత్తిడిలు-పరిష్కార మార్గాలు" అనే అంశంపై మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి జర్నలిస్టులకు సలహాలు-సూచనలందిస్తారు.

సభాధ్యక్షులుగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు,ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ సలహాదారులు(కమ్యూనికేషన్స్) జీవీడీ కృష్ణమోహన్ పాల్గొంటారు. జర్నలిస్టుల వృత్తి పరమైన మానసిక ఒత్తిడిపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ పాల్గొని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బా రెడ్డి తో జర్నలిస్టులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు అన్నారు.